క్లుప్తంగా

కూలి బకాయిలు చెల్లించాలి



నందిపేట్(ఆర్మూర్): ఉపాధి హామీ కూలీలకు, వన సేవకులకు బకాయిలను వెంటనే చెల్లించాలని అఖిల భారత ప్రగతిశీల కార్మిక సంఘం నాయకులు డిమాండ్ చేశారు. ఈమేరకు సోమవారం వారు ఎంపీవో కిరణ్‌కుమార్‌కు వినతి పత్రం అందజేశారు. ఉపాధి కూలీలకు, వనసేవకులకు సకాలంలో కూలి డబ్బులు రాక పోవడంతో తీవ్ర ఇబ్బందులకు గురవుతున్నారని పేర్కొన్నారు. నాయకులు గంగాదర్, దేవన్న ఉన్నారు.

వివాదాస్పద స్థలం పరిశీలన



ఆర్మూర్‌టౌన్: మండలంలోని చేపూర్ గ్రామంలో గల వివాదాస్పద స్థలాన్ని సోమవారం ఏసీపీ బస్వారెడ్డి పరిశీలించారు. అంతకుముందు వీడీసీ ఆధ్వర్యంలో గ్రామస్తులు గ్రామపంచాయతీ సమీపంలో ఏకమయ్యారు. విషయంలో తెలుసుకున్న పోలీసులు ఘటన స్థలానికి చేరుకుని ఎలాంటి గొడవలు జరగకుండా బందోబస్తు ఏర్పాటు చేశారు. అనంతరం ఏసీపీ గ్రామస్తులతో మాట్లాడి సమస్య పరిష్కరించే విధంగా చూస్తామన్నారు. అనంతరం ఆర్డీవో కార్యాలయంలో ఆర్డీవో రాజాగౌడ్ సమక్షంలో ఏసీపీ బస్వారెడ్డి, ఎస్‌హెచ్‌వో రవి కుమార్, గ్రామస్తులు సమావేశమయ్యారు. ఆర్డీవో మాట్లాడుతూ.. రెవెన్యూ అధికారులతో క్షేత్ర స్థాయిలో సర్వే చేయించి త్వరలోనే సమస్య పరిష్కరించే విధంగా చూస్తామని తెలిపారు.

హామీలను అమలు చేయాలి



బోధన్: అసెంబ్లీ ఎన్నికల్లో కాంగ్రెస్ ప్రభుత్వం ఇచ్చిన హామీలను వెంటనే అమలు చేయాలని, లేదంటే ఆందోళన కార్యక్రమాలు చేపడుతామని సీపీఐ(ఎంఎల్) మాస్‌లైన్ (ప్రజాపంథా) నాయకులు తెలిపారు. పట్టణంలోని పాన్‌గల్లీలో సోమవారం నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడారు. హామీల అమలు కోసం ఈ నెల 22న బోధన్‌లో ర్యాలీ, ధర్నా కార్యక్రమాన్ని నిర్వహించనున్నట్లు తెలిపారు. అన్ని వర్గాల ప్రజలు పెద్ద సంఖ్యలో తరలిరావాలని పిలుపు నిచ్చారు. డివిజన్ సహాయ కార్యదర్శి మల్లేష్, ప్రజా సంఘాల నాయకులు ఉన్నారు.

జీపీ రికార్డుల పరిశీలన




వర్ని: మండలంలోని హుమ్నపూర్ గ్రామంలో సోమవారం వర్ని ఎంపీడీవో వెంకటేష్ జీపీ రికార్డులను పరిశీలించారు. అలాగే నర్సరీ, మురికి కాలువలను, రోడ్లను తనిఖీ చేశారు. పంచాయతీ రికార్డులు ఎప్పటికప్పుడు అప్డేట్ చేయాలని గ్రామంలో రోడ్లు, మురికికాలువలు శుభ్రంగా ఉంచాలని, నర్సరీలో మొక్కలు చనిపోకుండా జాగ్రత్తలు చేపట్టాలని పంచాయతీ కార్యదర్శికి సూచించారు.

సరిహద్దులు ఏర్పాటు చేయండి



బాల్కొండ: మండల కేంద్రంలోని పెద్ద చెరువు శిఖం సరిహద్దులను ఏర్పాటు చేయాలని తహసీల్దార్ శ్రీధర్‌కు వీడీసీ సభ్యులు సోమవారం వినతిపత్రం అందజేశారు. శిఖం భూమిని కొందరు కబ్జాదారులు అక్రమించుకుంటున్నారని ఆరోపించారు. సర్వేయర్‌తో సర్వే నిర్వహించి సరిహద్దులు ఏర్పాటుచేయాలని కోరారు. వీడీసీ అధ్యక్షుడు అశోక్, ఉపాధ్యక్షుడు అర్కురి గంగాధర్, సభ్యులు తదితరులు పాల్గొన్నారు.

పోలీసు కళాజాత



ధర్పల్లి: మండల కేంద్రంలోని ప్రభుత్వ ఆదర్శ పాఠశాలలో సోమవారం పోలీస్ శాఖ ఆధ్వర్యంలో కళాజాత నిర్వహించారు. సైబర్ నేరాలు, డ్రంకెన్‌డ్రైవ్, అండర్ ఏజ్ డ్రైవింగ్ నేరాలపై కళాకారులు పాటలు, నాటికల ద్వారా విద్యార్థులకు అవగాహన కల్పించారు. క్రమశిక్షణతో చదువుకోవాలని, చెడు వ్యసనాల బారిన పడవద్దని, బాలిక రక్షణ, తల్లిదండ్రుల సంరక్షణ లాంటి విషయాలపై అవగాహన కల్పించారు.

'వన మహోత్సవం' లక్ష్యం చేరేనా?

- ఉమ్మడి బాల్కొండ మండలంలో లక్షకు పైగా మొక్కలు నాటేలా నిర్దేశం
- ఇప్పటికీ 25శాతం కూడా పూర్తికాని లక్ష్యం



బాల్కొండ మండల కేంద్రంలో వన మహోత్సవాన్ని ప్రారంభిస్తున్న అధికారులు (ఫైల్)

బాల్కొండ: ఉమ్మడి బాల్కొండ(బాల్కొండ, ముప్కాల్, మెండోరా) మండలాల పరిధిలోని గ్రామాల్లో ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపట్టిన వన మహోత్సవం నత్త నడ్వేలా సాగుతుంది. ఇప్పటి వరకు మూడు మండలాల్లో 25 శాతం కూడ మొక్కలు నాటడం పూర్తి కాలేదు. ఉమ్మడి బాల్కొండ మండల పరిధిలోని ప్రతి గ్రామ పంచాయతీ ఆధ్వర్యంలో 4100 మొక్కలను నాటాలి. కానీ ఇప్పటి వరకు ప్రతి జీపీలో వెయ్యి మొక్కలు కూడ నాటడం పూర్తి కాలేదు. కొన్ని గ్రామాల్లో గుంతలు తవ్వడం కూడ ప్రారంభం కాలేదు.

ఇదీ పరిస్థితి..

బాల్కొండ మండల పరిధిలో పది జీపీలు ఉన్నాయి. మొత్తం లక్ష్యం 41 వేల మొక్కలు నాటడం, కానీ ఇప్పటి వరకు 8 వేల మొక్కలు మాత్రమే నాటారు. మరో 2వేలు గుంతలు తవ్వడం పూర్తయింది. ముప్కాల్ మండలంలో ఏడు జీపీలు ఉండగా.. లక్ష్యం 28,700. కానీ ఇప్పటి వరకు 2500 మొక్కలు మాత్రమే నాటారు. మరో 2500 గుంతలు తవ్వి సిద్ధంగా ఉన్నాయి. మెండోరా మండల పరిధిలో పది జీపీలు ఉండగా.. లక్ష్యం 41వేలు. కానీఇప్పటి వరకు 9వేల మొక్కలు నాటారు. మరో వెయ్యి గుంతలు సిద్ధంగా ఉన్నాయి. ప్రస్తుతం గ్రామాల్లో వ్యవసాయ పనులు కొనసాగడంతో మొక్కలు నాటుటకు కూలీల కొరత ఉందని సిబ్బంది చెబుతు న్నారని అధికారులు అంటున్నారు. ఉన్నత అధికారులు స్పందించి సకాలంలో మొక్కలు నాటే కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని ఆయా గ్రామాల ప్రజలు కోరుతున్నారు.

వేగవంతం చేస్తాం..

వన మహోత్సవంలో భాగంగా మొక్కలు నాటే కార్యక్రమాన్ని వేగవంతం చేస్తాం. ముందుగా గుంతలు తవ్వడంపై దృష్టిసారించం. వర్షాలు కూడ లేక పోవడంతో మొక్కలు నాటడం ఆలస్యమవుతుంది.

– ఇందిరా, ఏపీవో, బాల్కొండ

సీజనల్ వ్యాధులపై అప్రమత్తంగా ఉండాలి



ఆర్మూర్‌లో మాట్లాడుతున్న డిప్యూటీ డీఎంహెచ్‌వో రమేష్



సులేమాన్‌నగర్‌లో..



యాద్‌గార్‌పూర్‌లో..

ఆర్మూర్‌టౌన్: విద్యార్థులు సీజనల్ వ్యాధుల పట్ల జాగ్రత్తలు తీసుకోవాలని డిప్యూటీ డీఎంహెచ్‌వో రమేష్ అన్నారు. పట్టణంలోని జిల్లా పరిషత్ రాం మందిర్, బాలుర పాఠశాలలో సోమవారం విద్యార్థులకు సీజనల్ వ్యాధులపై ఆయన అవగాహన సదస్సు నిర్వహించారు. ఈసందర్భంగా రమేష్ మాట్లాడుతూ.. ప్రతిఒక్కరూ ఇంటితో పాటు పరిసరాలను శుభ్రంగా ఉంచుకోవాలన్నారు. అనంతరం ఇంటింటి సర్వే నిర్వహించి సీజనల్ వ్యాధులపై అవగాహన కల్పించారు. యూపీహెచ్‌సీహెచ్‌వో కృష్ణమూర్తి, హెచ్‌ఈ శంకర్, హెల్త్ సూపర్‌వైజర్ శాంతా, ఆనంద్ బట్టు, హెచ్ఎం చలం, లక్ష్మి నర్సయ్య పాల్గొన్నారు.

రుద్రూర్: మండలంలోని సులేమాన్ నగర్ ఉర్దూ మీడియం పాఠశాల లో సోమవారం విద్యార్థులకు సీజనల్ వ్యాధులపై వైద్యశాఖ ఆధ్వర్యంలో అవగాహన కార్యక్రమం ఏర్పాటు చేశారు. ఆరోగ్య విస్తరణ అధికారి గోవర్ధన్ మాట్లాడుతూ.. దోమల వల్ల వచ్చే వ్యాధుల నివారణకు జాగ్రత్తలను వివరించారు. కోటగిరి మండలం యాద్గార్‌పూర్ గ్రామ పంచాయతీ కార్యాలయంలో సీజనల్ వ్యాధులపై అవగాహన కార్యక్రమం ఏర్పాటు చేశారు. హెచ్‌ఈవో గోవర్ధన్ మాట్లాడుతూ.. ప్రజలు పరిసరాల శుభ్రత పాటించాలన్నారు. ఆరోగ్య కార్యకర్తలు అనంత లక్ష్మి, సవిత, దీక్షిత, లక్ష్మీ, జీపీ సిబ్బంది పాల్గొన్నారు.

విత్తనాభివృద్ధి సంస్థ చైర్మన్‌కు సన్మానం



హైదరాబాద్‌లో అన్వేష్‌రెడ్డిని సన్మానిస్తున్న ఆలూర్ మండల కాంగ్రెస్ నాయకులు



ఆర్మూర్ కాంగ్రెస్ నాయకులు

పెర్కిట్(ఆర్మూర్)/ఆర్మూర్‌టౌన్/బాల్కొండ/వేల్పూర్/నవీపేట: వేల్పూర్ మండలం పచ్చలనడ్కుడ గ్రామానికి చెందిన ఎస్ అన్వేష్‌రెడ్డి సోమవారం హైదరాబాద్‌లో రాష్ట్ర విత్తన అభివృద్ధి సంస్థ చైర్మన్‌గా బాధ్యతలు స్వీకరించారు. ఈసందర్భంగా హైదరాబాద్‌లో ఆయనను బాల్కొండ, బోధన్, ఆర్మూర్ నియోజకవర్గాల్లోని ఆయా మండలాల కాంగ్రెస్ నాయకులు మర్యాద పూర్వకంగా కలిశారు. పుష్పగుచ్ఛాలు అందజేసి, సన్మానించారు. అలాగే రాష్ట్ర సహకార యూనియన్ లిమిటెడ్ చైర్మన్‌గా నియమితులైన మానాల మోహన్ రెడ్డిని సన్మానించారు. ముక్కెర విజయ్, మహిపాల్, రవి ప్రకాష్, భూమేష్‌రెడ్డి, అయ్యప్ప శ్రీను, నర్సారెడ్డి, శాల ప్రసాద్, మల్లారెడ్డి, సుబాష్, నర్సారెడ్డి, చిన్నారెడ్డి, గోవర్ధన్‌రెడ్డి, బాబు తదితరులు ఉన్నారు.

సంక్షిప్తం

బాధితుడి కుటుంబానికి చేయూత



పెర్కిట్(ఆర్మూర్): పెర్కిట్‌లోని ఓ బాధిత కుటుంబానికి సేవ్ లైఫ్ ఫౌండేషన్ వ్యవస్థాపకుడు ప్రభాస్ ఆధ్వర్యంలో సోమవారం రూ.10వేలు ఆర్థిక సహాయం అందజేశారు. వైస్ చైర్మన్ బైరి శ్రీధర్, సభ్యులు పాల్గొన్నారు.

ఏపీపీగా సరసం చిన్నారెడ్డి



ఆర్మూర్‌టౌన్: ఆర్మూర్ కోర్టు అదనపు ప్రభుత్వ న్యాయవాది(ఏపీపీ)గా సరసం చిన్నారెడ్డి నియమితులైయ్యారు. ఈసందర్భంగా ఆర్మూర్ బార్ అసోసియేషన్ న్యాయవాదులు సోమవారం చిన్నారెడ్డిని సన్మానించారు. తుమ్మ సుకేష్, సురేష్, రాజేశ్వర్, ఏలేటి గంగాధర్, కృష్ణంరాజు, అమితాబ్ కిరాడ్, జగన్, రమేష్, అశోక్ పాల్గొన్నారు.

టీజీబీ మేనేజర్‌గా సంపత్



రుద్రూర్: మండల కేంద్రంలోని తెలంగాణ గ్రామీణ బ్యాంక్ మేనేజర్‌గా సంపత్ కుమార్ సోమవారం బాధ్యతలు స్వీకరించారు. ఇక్కడ విధులు నిర్వహించిన మేనేజర్ వాసు ఏక్‌మామిడి బ్యాంకుకు బదిలీ అయ్యారు. వికారాబాద్ బ్యాంక్ మేనేజర్‌గా పనిచేస్తున్న సంపత్ కుమార్ బదిలీపై రుద్రూర్‌కు వచ్చారు.

బోధన్ బల్దియా ఇన్‌చార్జి కమిషనర్‌గా శంకర్?

బోధన్‌టౌన్(బోధన్): బోధన్ మున్సిపాలిటీ ఇన్‌చార్జి కమిషనర్‌గా శంకర్ బాధ్యతలు తీసుకోనున్నట్లు తెలిసింది. కమిషనర్ వెంకట నారాయణ నెల రోజులు సెలవుపై వెళ్లారు. దీంతో ఇన్‌చార్జి కమిషనర్‌గా ఆయన మంగళవారం బాధ్యతలు స్వీకరించనున్నట్లు సమాచారం.

విద్యార్థులకు వ్యాసరచన పోటీలు



బాల్కొండ: ముప్కాల్ మండల కేంద్రంలోని కేజీబీవీ పాఠశాల విద్యార్థులకు సోమవారం భారత్ పెట్రోల్ బంక్ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న స్వచ్ఛత పక్వాడ్‌లో భాగంగా వ్యాసరచన పోటీలను నిర్వహించారు. అనంతరం విజేతలకు బహుమతులు అందజేశారు. కంపెనీ ప్రతినిధులు కిరణ్‌కుమార్, బన్ని, శ్రీనివాస్, కాంతికుమార్, ప్రిన్సిపాల్ వినోద తదితరులు పాల్గొన్నారు.

లయన్స్‌క్లబ్ ఆధ్వర్యంలో..



వేల్పూర్: మండలంలోని పడగల్ జెడ్పీహెచ్ఎస్‌లో సోమవారం లయన్స్ క్లబ్ ఆఫ్ ఆర్మూర్ నవనాథపురం ఆధ్వర్యంలో 'ప్రపంచ యువ నైపుణ్య దినోత్సవం' నిర్వహించారు. ఈసందర్భంగా విద్యార్థులకు వ్యాసరచన పోటీలు నిర్వహించారు. అనంతరం విజేతలకు బహుమతులు ప్రదానం చేశారు. లయన్స్‌క్లబ్ అధ్యక్షుడు చెరుకు పృథ్వీరాజ్, హెచ్ఎం రాంచందర్, జలంధర్, నారాయణగౌడ్, అంబాల తిరుపతి, చావ్లా పాల్గొన్నారు.

ఏజీపీకి సన్మానం

బోధన్‌టౌన్(బోధన్): బోధన్ కోర్టులో ఏజీపీగా నూతనంగా నియామకం అయిన మాజీ మున్సిపల్ చైర్మన్ గౌసొద్దీన్‌ను సోమవారం యూత్ కాంగ్రెస్ నాయకులు సన్మానించారు. నాయకులు తలారి నవీన్, చిరంజీవి, సాయికృష్ణ, జహీర్, రమేస్, మున్నా ఉన్నారు.

ఆధ్యాత్మికం..

■ **పాఠశాలలో బోనాల సంబురాలు**



పెర్కిట్(ఆర్మూర్): మామిడిపల్లి స్కాలర్స్ పాఠశాలలో సోమవారం బోనాల పండుగను ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా విద్యార్థులు అమ్మవారు, శివసత్తులు, పోతురాజుల వేషాధారణలో అలరించారు. అలాగే పాఠశాల సమీపంలోని దేవాలయంలో బోనాలను సమర్పించారు. కరస్పాండెంట్ వేణు, ప్రిన్సిపాల్ ఒడ్డెన్న, హెచ్ఎం సహస్ర పాల్గొన్నారు.

■ **శివాలయంలో ప్రత్యేక పూజలు**



ఆర్మూర్‌టౌన్: పట్టణంలోని నవనాథ సిద్ధులగుట్టపై గల శివాలయంలో సోమవారం భక్తులు గాజులతో ప్రత్యేక పూజలు నిర్వహించారు. అలాగే రామాలయం, దుర్గామాత, దత్తాత్రేయ, అయ్యప్ప, ఎల్లమ్మతల్లి, ఏకశిల స్తంభం, హనుమాన్ ఆలయాల్లోనూ పూజలు నిర్వహించారు. అలాగే స్వామివారి ఉత్సవ విగ్రహాలకు నందీశ్వర మహారాజ్ ప్రత్యేక పూజలు చేసి పల్లకిసేవ నిర్వహించారు. అనంతరం భక్తులు తీర్థప్రసాదాలతో పాటు అన్నప్రసాదంను స్వీకరించారు. ఆలయ కమిటీ సభ్యులు సుమన్, గంగారెడ్డి, మల్లయ్య, సతీష్, ప్రశాంత్‌గౌడ్, మంజుల మురళి, బట్టు శంకర్, పాల్గొన్నారు.

■ **గ్రామదేవతలకు జలాభిషేకాలు**



ఎడపల్లి(బోధన్): మండలంలోని ఠానాకాలన్ గ్రామంలో సోమవారం త్రివేణి సంగమం, బాసర నుంచి గోదావరి జలాలను గ్రామస్తులు తీసుకువచ్చి గ్రామదేవతలకు జలాభిషేకం చేశారు. అనంతరం గ్రామంలోని హనుమాన్ ఆలయం, దత్తాత్రేయ మందిరం, శివాలయం, మహాలక్ష్మి ఆలయంలో ప్రత్యేక పూజలు చేశారు. వర్షాలు కురవాలని కోరుతూ పూజలు నిర్వహించినట్లు గ్రామస్తులు తెలిపారు.

నాణ్యమైన భోజనం అందించాలి

మోపాల్(నిజామాబాద్‌రూరల్): ప్రభుత్వ పాఠశాలల్లో విద్యార్థులకు మెనూ ప్రకారం నాణ్యమైన మధ్యాహ్న భోజనాన్ని అందించాలని డీఈవో దుర్గాప్రసాద్ సూచించారు. మండలంలోని కులాస్‌పూర్ జిల్లాపరిషత్ ఉన్నత పాఠశాలను సోమవారం ఆయన సందర్శించారు. ఈసందర్భంగా మధ్యాహ్న భోజనానికి వండుతున్న బియ్యంను పరిశీలించి సంతృప్తి వ్యక్తంచేశారు. ఈసందర్భంగా డీఈవో మాట్లాడుతూ.. ఇటీవల జిల్లాలోని కొన్ని పాఠశాలలకు ముక్కిపోయిన, పురుగులు ఉన్న బియ్యం సరఫరా అయ్యాయని, వాటిని వెనక్కి పంపించి, కొత్త బియ్యం అందించామని తెలిపారు. ఉపాధ్యాయులు విధుల్లో నిర్లక్ష్యం వహించోద్దన్నారు.

నియోజకవర్గాన్ని అభివృద్ధి చేస్తాం

- ఎమ్మెల్యే పైడి రాకేష్‌రెడ్డి
- లబ్ధిదారులకు షాదీ ముబారక్ చెక్కుల పంపిణీ



నందిపేటలో లబ్ధిదారులకు చెక్కులను అందజేస్తున్న ఎమ్మెల్యే పైడి రాకేష్‌రెడ్డి

నందిపేట్(ఆర్మూర్): పార్టీలకతీతంగా నియోజకవర్గ అభివృద్ధికి పాటుపడుతానని ఎమ్మెల్యే పైడి రాకేష్‌రెడ్డి అన్నారు. మండల కేంద్రంలోని రైతువేదికలో సోమవారం ఆయన ఉమ్మడి నందిపేట మండలాలకు చెందిన లబ్ధిదారులకు షాదీముబారక్ చెక్కులను అందజేశారు. అనంతరం రైతు వేదిక ఆవరణలో మొక్కలు నాటారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ.. ఆర్మూర్ నియోజకవర్గంలో అర్హులైన వారికి గృహాలు త్వరలో మంజూరు అయ్యేలా కృషిచేస్తామనారు. ప్రభుత్వ పథకాలు అర్హులకు అందేలా చూడాలని, అనర్హులకు అందినట్లయితే నా దృష్టికి తీసుకురావాలని, మీ గ్రామాలకు అధికారులను తీసుకు వచ్చి నిలదీస్తానని అన్నారు. తహసీల్దార్ ఆనంద్‌కుమార్, డిప్యూటీ తహసీల్దార్ వసంతరావు, డొంకేశ్వర్ ఆర్ఐ రాజేశ్వర్, భూతం సాయరెడ్డి, రాజేశ్వర్, రాజు, రమేష్, సంజీవ్, గాండ్ల నర్సగౌడ్, లింగారెడ్డి, గంగాధర్‌గౌడ్ పాల్గొన్నారు.

రూ.లక్షతోపాటు తులం బంగారం ఇవ్వాలి



చెక్కులు అందజేస్తున్న ఎమ్మెల్యే ప్రశాంత్‌రెడ్డి

భీమ్‌గల్: రాష్ట్ర ప్రభుత్వం వెంటనే కల్యాణలక్ష్మి, షాదీముబారక్ లబ్ధిదారులకు రూ.లక్ష చెక్కుతో పాటు తులం బంగారం ఇవ్వాలని బాల్కొండ ఎమ్మెల్యే ప్రశాంత్‌రెడ్డి కోరారు. భీమ్‌గల్‌లోని బంజార భవన్‌లో సోమవారం పలువురు లబ్ధిదారులకు కల్యాణలక్ష్మి, షాదీముబారక్ చెక్కులను ఎమ్మెల్యే అందజేశారు. ఈసందర్భంగా ప్రశాంత్‌రెడ్డి మాట్లాడుతూ.. ఎన్నికల్లో పీసీసీ అధ్యక్షుడి హోదా లో రేవంత్‌రెడ్డి లబ్ధిదారులకు తులం బంగారం ఇస్తామని హామీ ఇచ్చారనీ, కాంగ్రెస్ ప్రభుత్వం ఏర్పాటై ఏడు నెలలు గడిచినా చెప్పిన హామీ ఆచరణలోకి రాలేదని నిలదీశారు. వెంటనే ప్రభుత్వం హామీని నెరవేర్చాలని కోరారు. అధికారులు, ప్రజా ప్రతినిధులు తదితరులు పాల్గొన్నారు.

అంగన్‌వాడీల సమస్యలను పరిష్కరించాలి



ఆర్మూర్ ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయాన్ని ముట్టడించిన అంగన్‌వాడీ టీచర్‌లు



వినతిపత్రం అందజేస్తున్న అంగన్‌వాడీలు

ఆర్మూర్‌టౌన్: తమ సమస్యలను రాష్ట్ర ప్రభుత్వం తక్షణమే పరిష్కరించాలని అంగన్‌వాడీ టీచర్‌లు డిమాండ్ చేశారు. ఈమేరకు సోమవారం వారు అంగన్‌వాడీ టీచర్స్ అండ్ హెల్పర్స్ యూనియన్ సీఐటీయూ ఆధ్వర్యంలో ఆర్మూర్ ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయాన్ని ముట్టడించారు. అనంతరం క్యాంపు కార్యాలయ సిబ్బందికి వినతిపత్రం అందజేశారు. జీవోనంబర్ 10 రద్దు చేయాలని, వీఆర్ఎస్ సౌకార్యం కల్పిస్తు కొత్త జీవో ఇవ్వాలని డిమాండ్ చేశారు. నాయకులు వేంకటేష్, ఎల్లయ్య, అంగన్‌వాడి టీచర్‌లు పాల్గొన్నారు.

వేల్పూర్: తమ సమస్యలను రాష్ట్ర ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లాలని సోమవారం ఎమ్మెల్యే ప్రశాంత్‌రెడ్డికి అంగన్‌వాడీలు వినతిపత్రం అందజేశారు. కార్యక్రమంలో నియోజకవర్గ అంగన్‌వాడీలు తదితరులు పాల్గొన్నారు.

మొక్కల పెంపకంతో పర్యావరణ సంరక్షణ



మందర్న గ్రామంలో మొక్కలు నాటుతున్న ఎస్సై నాగనాథ్, సిబ్బంది, గ్రామస్తులు



రెంజర్లలో మొక్కలను పంపిణీ చేస్తున్న అధికారులు

బోధన్‌రూరల్: మొక్కల పెంపకంతో పర్యావరణాన్ని సంరక్షించవచ్చని బోధన్ రూరల్ ఎస్ఐ నాగనాథ్ అన్నారు. సాలూర మండలంలోని మందర్న గ్రామంలో వన మహోత్సవం కార్యక్రమంలో భాగంగా సోమవారం 200 మొక్కలను నాటారు. మొక్కల సంరక్షణ కోసం గ్రామస్తులు కృషి చేయాలని ఆయన కోరారు. హెడ్ కానిస్టేబుల్ లింగం, సిబ్బంది, గ్రామ పెద్దలు పాల్గొన్నారు.

పెర్కిట్(ఆర్మూర్): పెర్కిట్‌లోని సేయింట్ ఆన్స్ పాఠశాలలో సోమవారం వన మహోత్సవం కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా విద్యార్థులు పాఠశాల ఆవరణలో మొక్కలను నాటారు. హెచ్ఎం సిస్టర్ సుమలత, కరస్పాండెంట్ గోపు జిసింత, సిస్టర్ రోబట్ట పాల్గొన్నారు.



పెర్కిట్‌లో మొక్కలు నాటుతున్న విద్యార్థి

మొక్కల పంపిణీ

బాల్కొండ: ముప్కాల్ మండలం రెంజర్ల గ్రామంలో మహిళ సమాఖ్యల సభ్యులకు మొక్కలను సోమవారం జీపీ అధికారులు పంపిణీ చేశారు. ప్రతి ఒక్కరు ఇంటి వరణలో 5 మొక్కలను నాటాలన్నారు. జీపీ కార్యదర్శి శ్రీనివాస్, సమాఖ్య అధ్యక్షురాళ్లు, వీవోఏలు తదితరులు పాల్గొన్నారు.

పాడిపంటలపై అవగాహన



ఎడపల్లి(బోధన్): మండల కేంద్రంలోని బాలికల గురుకుల పాఠశాలలో సోమవారం పాడిపంటల తీరుపై విద్యార్థులకు అవగాహన సదస్సు నిర్వహించారు. ఈసందర్భంగా జాతీయ ఉత్తమ రైతు అవార్డు గ్రహీత కరటూరి పాపారావు కార్యక్రమంలో పాల్గొని, మాట్లాడారు. దేశ ఆర్థిక పరిపుష్టికి రైతన్నలే జీవనాధారం అని అన్నారు. ప్రతి ఒక్కరు బాల్య దశ నుంచి వ్యవసాయంపై అవగాహన పెంచుకోవాలన్నారు. విశ్రాంత ఉద్యోగి వివేకానంద రెడ్డి, ప్రిన్సిపల్ సుహాసిని రెడ్డి, జైతాపూర్ సింగిల్ విండో అధ్యక్షుడు సత్యనారాయణ చౌదరి, ఎల్లయ్య యాదవ్, అనూష, దీప్తి ఉన్నారు.

సినిమాలు తెలుగు/హిందీ/ఇంగ్లీష్



పీవీఆర్ మల్టీప్లెక్స్(ఆర్మూర్)

స్క్రీన్-1 –	కల్కి-2898ఏడీ (తెలుగు) – 10.15, 2.00, 5.45, 9.30
స్క్రీన్-2 –	కల్కి –2898ఏడీ (3డీ తెలుగు) – 11.15, 3.00, 6.45, 10.30
స్క్రీన్-3 –	భారతీయుడు-2 (తెలుగు) – 10.00, 1.45, 5.30, 9.15
స్క్రీన్-4 –	భారతీయుడు-2 (తెలుగు) – 11.00, 2.45, 6.30, 10.15

ఇందూరువాసి రెస్టారెంట్‌లో రోహిత్‌శర్మ సందడి



నిజామాబాద్‌నాగారం: అమెరికాలోని టెక్సాస్ స్టేట్ ఫిక్సోలో ఇందూరుకు చెందిన శరత్ స్థాపించిన 'దేశీ చౌరస్తా' రెస్టారెంట్‌లో టీమిండియా కెప్టెన్ రోహిత్ శర్మ సందడి చేశారు. అక్కడి ఫేమస్ ఇరానీ చాయ్ గురించి అడిగి మరీ రుచి చూశారు. అనంతరం రెస్టారెంట్ సభ్యులతో కలిసి సెల్ఫీలు దిగారు. ఈ దృశ్యాలను రెస్టారెంట్ వ్యవస్థాపకుడు శరత్ పొద్దుటూరి సోషల్‌మీడియాలో షేర్ చేశారు. శరత్ 2022లో కొప్పెల్ సిటీలో మొదటి రెస్టారెంట్ ప్రారంభించగా, ప్రస్తుతం వ్యాపారాన్ని 14 బ్రాంచీలకు విస్తరించారు. తన రెస్టారెంట్లలో వివిధ దేశాలకు చెందిన 300 మంది యువతకు ఉపాధి కల్పిస్తున్నారు.